




# పూబాల

## నెలనెలా ఒక మంచి కవితాపరిచయం

కవిత్వంలో స్త్రీలు మాత్రమే చెప్పగలిగే అంశాలు కొన్ని ఉన్నాయి. ఇటీవలికాలంలో మన కవయిత్రులు అటువంటి అంశాలపై విరివిగానే స్పందించారు. వీటిలో ఎక్కువభాగం స్త్రీలుగా తామెదుర్కొనే బాధలు వర్ణించేవే అయినా, ఇంద్రియ సుఖాన్ని, ఆనందాన్ని వ్యక్తపరిచే కవితలు కూడా లేకపోలేదు. కాని, స్త్రీ సహజమైన చేతనా సౌకుమార్యం ప్రదర్శించే కవితలు అరుదుగా ఉంటాయి.

ఇంద్రాణి ప్రచురించిన "వానకు తడిసిన పువ్వొకటి" సంకలనంలో ఇటువంటి ప్రయత్నం కనిపిస్తుంది. ఇందులో ఉన్నది కేవలం ప్రకృతి అందాలను కీర్తించటంకాదు. ప్రకృతిని ఒక సహచరిగా, ఇష్ట సఖిగా భావించి, కవయిత్రి దానితో సంస్పందిస్తున్నట్టుగా మనకు తెలుస్తుంది. వాన, గాలివాన, ఇసుక రేణువు, అరటి చెట్టు - ఇలా ఏ అంశం తీసుకున్నా దానిని కవితగా మలచిన తీరులో మనకిది స్పష్టమౌతుంది.

ఇలా రాసిన కవితల్లో నన్ను బాగా కట్టుకున్న కవిత "పూబాల". స్త్రీలకు సహజంగానే పూలతో చెలిమి ఉంటుంది. అందుకేనేమో, నండూరి వారు "పూల బాసలు తెలుసు ఎంకికి" అని రాసారు. అమ్మాయిలు పువ్వులేరటం, పువ్వుల్ని రాసిగా పోసి చుట్టూ కూర్చుని దండలల్లటం ఒకప్పుడు తరచు కనిపించే దృశ్యాలు. ఇంద్రాణి అనేక కవితల్లో పువ్వులతో స్నేహం ప్రకటితమౌతుంది. ఈమె కవితల్లో నీళ్ళల్లో రాలే పూలు పరధ్యానంలో పడవేస్తాయి. బావి పక్కన లిల్లీ పూలు రాత్రంతా పెరట్లో కూర్చోపెడతాయి. వానలో పువ్వులు దేవతల భాష మాట్లాడుతుంటాయి. ఈ స్నేహాన్ని గమనించినప్పుడు, ఆమె తననొక పూబాలగా ఊహించుకోవటంలో ఆశ్చర్యంలేదు. తన వివిధ స్థితుల్ని సూచించటానికి పూలకు సంబంధించిన పోలికలు - పూల రెమ్మలా వంగి నడవటం, పూలజడలా నిలబడటం, మొగ్గలా ముడుచుకుపోవటం వంటివి- వాడటం ఈ కవితకు అందాన్నిచ్చింది.

మరీ ముఖ్యంగా మల్లెదండలా ఒరిగి నిద్రపోవటమన్న ఊహ చాలా బాగుంది. పూలను కూర్చినట్టుగా, పదాల ఎంపికలో, కూర్పులో ఎంతో శ్రద్ధ, నేర్పు కనిపిస్తాయి. ఈ కవితలో స్త్రీకి, పుష్పానికీ ఎంత అభేదం పాటించబడిందంటే, దీనిని ఒక పువ్వు స్వగతంగా భావించినా బాగానే ఉంటుంది. కవిత శీర్షిక కూడా ఇలా రెండురకాలుగా అనుకోవటానికి వీలు కల్పిస్తుంది. ఇక్కడ చలం "ఒక పువ్వు పూసింది" కథ గుర్తుచేసుకోవచ్చు. కథలో పువ్వు ఆశ్చర్యానికి, అమాయకత్వానికీ ప్రతీకైనట్టే ఈ కవితలో అది ఆత్మ విశ్వాసానికీ, పడుచుదనానికీ ప్రతీక. రెంటిలోనూ స్త్రీత్వమే ప్రధానంశమన్నది వేరే చెప్పనక్కర్లేదు. పరిమితమైన నాలుగు పోలికలు, ఎనిమిది వాక్యాలతో ఈ కవిత మంచి ప్రభావం సాధించింది. పదాల, పదచిత్రాల పొదుపు కవితకెలా వన్నెతెస్తుందో ఇది చూపిస్తుంది. ప్రతి స్టాంజాలోను, మొదటి వాక్యంలో ఒక పోలిక, రెండవ వాక్యంలో దాని ఫలితమూ చెప్పటంవలన కవితమొత్తానికీ ఒక సమతుల్యం ఏర్పడింది. వివిధ చర్యలను వర్ణించే కవితను నిద్రతో ముగించటం కూడా బాగుంది. కవిత ముగింపులో దిండంతా సువాసన అద్దుకున్నట్టు, చదవటం ముగించేసరికి దీని పరిమళం మన

మనసుల్లో పరుచుకుంటుంది. ఇటువంటి కవితలు మనలో సున్నితత్వాన్ని పెంపొందిస్తాయి. వార్తా కథనాలతో, వాణిజ్య ప్రకటనలతో మొద్దుబారిన మన చేతనకి మళ్ళీ పదును పెడతాయి. అందుకోసమైనా వీటిని తప్పక చదవాలి.

*కవిత పూర్తి పాఠం:*

*పూల కొమ్మలా వంగి నడుస్తాను*
*పుప్పొడి అన్నివైపులా ఎగురుతుంది*

*పసిమొగ్గలా ముడుచుకుపోతాను*
*సుగంధం లోలోపలే బందీ అవుతుంది*

*పూలజడలా కదలక నిలబడతాను*
*తుమ్మెద ఒకటి వచ్చివాలుతుంది*

*మల్లెదండలా ఒరిగి నిద్రపోతాను*
*దిండంతా సువాసన అద్దుకుంటుంది.*

- ఇంద్రాణి

